న్యాయ పూర్తి వివరణ

న్యాయ పరిధి : భూమి చట్టాలు
సెక్షన్ పరిధి : భూమి తగాదాలు
ఉప సెక్షన్ పరిధి : అనుదేశించిన భూముల చట్టం

## సంక్షిప్తంగా న్యాయ సమాచారం

భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వము భూమిని వ్యవసాయం లేదా నివాసము ఎర్పరుచుకొనుటకు కేటాయిస్తుంది. ఇటువంటి భూములను ఇతరులకు అమ్మివేయుట చటరిత్యా శిక్షార్హము. చట్ట ఉల్లంఘనకు 6 నెలలు జైలుశిక్ష మరియు రూ' 2000/- నుండి రూ' 5000/- వరకు జరిమానా విధించబడును. అన్యాక్రాంతం కాబడిన భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నములో అధికారులకు ఆటంకము కలిగించువారు కూడా శిక్షార్హులు.

## విపులంగా న్యాయ వివరాలు

అన్యాక్రాంతము చేయుటకు వీలులేనట్లుషరతులు పెట్టి అనుదేశించిన భూములు నిరుపేదలకు ప్రభుత్వము అప్పగిస్తుంది. అలా అప్పగించబడిన భూములను లబ్ధిదారులు ఎట్టి పరిస్థితులలోను అన్యాక్రాంతము చేయరాదు.

భూమిలేని నిరుపేద అనగా ఏదైన రైతు 2 1/2 ఎకరాలు మించని మాగాణిగాని 5 ఎకరాలు మించని మెట్ట భూమిగాని కలిగియుండి మరియు ఇతరత్ర ఏ విధమైన జీవనోపాధి లేనివారు.
బదలాయింపు అనే పద నిర్వచనంలో భూమి విక్రయం, దానం, మార్పిడి, తనఖా పెట్టడానికి, కౌలు మొదలైన లావాదేవీలు వస్తాయి.
ప్రభుత్వము అప్పగించిన భూములను అన్యాక్రాంతము చేస్తూ అమలు చేయబడిన ఏదైనా దస్తావేజు లేదా పత్రము చట్ట విరుద్ధము మరియు చట్టపరంగా చెల్లదు. జిల్లాలో అసైన్ చేయబడిన భూములను పొందుపరచి జిల్లా కలెక్టరు ఒక పట్టిక తయారు చేసి రిజిస్టరింగ్ అధికారులకు అందచేయవలెను. అట్టి అసైన్ చేయబడిన భూములకు సంబంధించిన ఎలాంటి లావాదేవీలను కలెక్టరు ముందస్తు అనుమతి లేనిదే రిజిష్టరు చేయకూడదు.
ప్రభుత్వము నిరుపేదకు అప్పగించిన భూములను మరియొక భూమిలేని నిరుపేదకు మాత్రమే అన్యాక్రాంతము చేయవచ్చు.

## పరిష్కార పద్ధతి

## సెక్షన్ పేరు

సెక్షన్ 4, ఆంధ్రప్రదేశ్ అనుదేశించిన భూముల బదిలీ నిషేధ చట్టం, 1977

## ఫిర్యాదు ఎవరికి ఇవ్వాలి / ఎక్కడ ఇవ్వాలి ?

కలెక్టరు లేదా మండల రెవెన్యూ అధికారి పై స్థాయి అధికారులకు దరఖాస్తు చెయాలి.

## కేసు ఫైల్ చేయడం ఎలా ?

1. దరఖాస్తు స్వీకరించిన తరువాత కలెక్టరు (ఫారం లో) ప్రతివాదులకు నోటీసు జారీ చేస్తారు.
2. నోటీసు జారీ చేసిన 15 రోజులలోగా ప్రతివాదుల అభ్యర్థనలను విచారించి, తగు ఆర్డరులను జారీ చేస్తారు.
3. అసలు లబ్ధిదారునకు లేదా అతని వారసులకు భూమిని తిరిగి అప్పగిస్తారు కానీ ఇది ఒకే సారి చేయబడుతుంది.
4. ఒకసారికి మించి అప్పగించిన భూములను లబ్ధిదారు అన్యాక్రాంతము చేస్తే, ప్రభుత్వము తిరిగి భూమి స్వాధీనపరచుకొని, మరియొక పేద రైతునకు అప్పగిస్తుంది.

## తరువాత

1. ఎమ్.ఆర్.ఓ ఆర్డరు నుండి 90 రోజుల్లోగా రెవెన్యూ డివిజన్ ఆఫీసరుకు అప్పీలు చేయవచ్చు.
2. ఆర్.డి.ఓ ఆర్డరు నుండి 90 రోజుల్లోగా జిల్లా కలెక్టరుకు అప్పీలు చేయవచ్చు.
3. కలెక్టరు దిగువశ్రేణి అధికారుల నుండి రికార్డులు తెప్పించి, పరిక్షించి, ఆర్.డి.ఓ. ఆర్డరులను ఆమోదించవచ్చు లేదా మార్చనూ వచ్చు.

## ప్రత్యామ్నాయ పరిష్కారం

ప్రత్యామ్నాయ పరిష్కారాలు లేవు.